క్లుప్తంగా

ఖజానా అధికారికి సన్మానం



ఖజానా అధికారిని సన్మానిస్తున్న సర్వజన ఆస్పత్రి ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రి స్థాయి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మారిన నేపథ్యంలో జీతాల మంజూరులో ఏర్పడిన సమస్యను పరిష్కరించి జీతాలు ఇప్పించినందుకుగాను జిల్లా ఖజనా అధికారి కుమార్‌ను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉద్యోగులు గురువారం స్థానిక ఖజనా కార్యాలయంలో సన్మానించారు. మిగతా నాలుగు జిల్లాల సర్వజన ఆస్పత్రి కంటే ముందుగా జీతాలు ఇప్పించడం ఆనందంగా ఉందని ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో జ్యోతిర్మయి, రాజారావు, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రారంభమయ్యే సమావేశానికి అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

నెల్లిమర్ల: నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ బంగారు సరోజిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా చండీహోమం

డెంకాడ: మండలంలోని సింగవరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గురువారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు హోమంలో పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం చేపడతామని గ్రామపెద్దలు పిట్టా అప్పారావు, తదితరులు తెలిపారు.

వృద్ధాశ్రమానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత రామదాసు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీబాపూజీ వృద్ధాశ్రమానికి పీఎస్.లక్ష్మీపురం గ్రామానికి చెందిన దన్నాన రామదాసు రూ.10 వేలు విరాళం అందజేశారు. తన కుమార్తె దన్నాన హేమలత పుట్టినరోజు సందర్భంగా గురువారం ఈ మొత్తాన్ని ఆశ్రమం నిర్వాహకుడు కోట్ల లక్ష్మణరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివాహ వార్షికోత్సవాలు, పుట్టినరోజు వేడుకల పేరుతో వృథా ఖర్చులు చేయకుండా ఆశ్రమంలో వృద్ధుల కోసం ఖర్చు చేయాలని ప్రజలను కోరారు.


పిల్లలను ఎండలో తిరగనీయొద్దు



చిన్నారులతో మాట్లాడుతున్న డాక్టర్ సాయికృష్ణ

గజపతినగరం రూరల్: మూడేళ్ల లోపు చిన్నారులను తొమ్మిది దాటిన తరువాత ఎండలో తిరగనీయొద్దని మరుపల్లి ఆస్పత్రి డాక్టర్ సాయికృష్ణ సూచించారు. మండలంలోని మదుపాడ గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. నీరు, ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలని, ఎండలో ఎక్కువగా తిరిగితే వడదెబ్బకు గురికావడంతో పాటు చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. చేతులశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

జాబ్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ లక్ష్మి, ఉపాధిహామీ సిబ్బంది

జామి: ఉపాధిహామీ పథకం పనుల కోసం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన వారు జాబ్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ చిప్పాడ లక్ష్మి కోరారు. ఈ మేరకు స్థానిక ఎస్సీ కాలనీలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాబ్‌కార్డు లేనివారికి కార్డు మంజూరుతో పాటు వంద రోజులు పని కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఎల్ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్ కె.చిన్నంనాయుడు, ఏపీఓ శేఖర్, ఉపాధిహామీ సిబ్బంది, మేట్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా.. సంక్షేమ పథకాల పంట

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని 28వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



రాజీవ్‌నగర్ కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్ విజయలక్ష్మి, తదితరులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ రాజీవ్‌నగర్ ప్రాంతంలో గురువారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు కోలగట్లకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పాలన తీరుపై ప్రజాభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, ఆసరా, అమ్మఒడి, వసతిదీవెన, విద్యాదీవెన వంటి పథకాలు అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తుంటే ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకం అందడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అవినీతి, లంచగొండితనం లేకుండా నేరుగా వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు సకాలంలో అందిస్తుండడంతో ముఖ్యమంత్రి జగనన్న పాలనపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ, తమ డివిజన్ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్ రెడ్డి గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో మాక్ ఎంసెట్



వివరాలు వెల్లడిస్తున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వంశీకుమార్, తదితరులు

విజయనగరం: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలలో ఉన్న ఇంటర్ విద్యార్థులకు మోడల్ ఎంసెట్‌ను ఈనెల 29, వచ్చే నెల 2,3 తేదీల్లో నిర్వహించనున్నట్లు పరిషత్ జిల్లా కన్వీనర్ వంశీకుమార్ తెలిపారు. నగరంలోని పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో మోడల్ ఎంసెట్ నిర్వహిస్తామని, ఆసక్తిగల విద్యార్థులు హాజరుకావాలని కోరారు. విద్యార్థుల శ్రేయస్సే ధ్యేయంగా ఏబీవీపీ పోరాటాలు, ఉద్యమాలు చేస్తోందని.. అలాగే విద్యార్థులను ప్రోత్సహించడానికి పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. పరీక్షలో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిషత్ ప్రతినిధులు అనిల్, నాయుడు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ



గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలితకు కుర్చీలను అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఎస్‌వీఎన్ నగర్ వాకర్స్ క్లబ్, శారదా సేవా సంఘ సభ్యులు 25 కుర్చీలను వితరణగా అందజేశారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్.లలిత, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు అల్లాడి శివరామకృష్ణ, కార్యదర్శి కందుల సంతోష్, ఉప గ్రంథాలయ అధికారి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామదేవత పండగలు ప్రారంభం

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో గ్రామదేవతల పండగలు గురువారం ప్రారంభమయ్యాయి. మే 3 వరకు జరగనున్నాయి. జి.అగ్రహారం, కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీ ప్రాంతాల్లో గ్రామదేవతల పండగ నిర్వహిస్తున్నారు. రిక్షాకాలనీలో ఉన్న భూలోక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి చీరలు చూపించి, పసుపు, కుంకుమతో పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే ఈ నెల 30న జి.అగ్రహారంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో, మే 2న జి.అగ్రహారంలోని పైడితల్లి ఆలయంలో భక్తులు మొక్కులు సమర్పించుకోనున్నారు. పన్నెండు సంవత్సరాలు తరువాత వచ్చిన పండగ కావడంతో మూడు గ్రామాలకు చెందిన వారంతా ఏకమై పండగను ఘనంగా జరుపుకుంటున్నారు.

'జల్ జీవన్ మిషన్'ను సద్వినియోగం చేసుకోవాలి



కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న అప్పలనాయుడు, జనార్దనరావు, తదితరులు

పూసపాటిరేగ: జల్‌జీవన్ మిషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు పతివాడ అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక హరిజన కాలనీలో జల్‌జీవన్ మిషన్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకానికి సంబంధించి నియోజకవర్గానికి ప్రభుత్వం సుమారు 13 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, మహంతి లక్ష్మణరావు, టొంపల సీతారాం, రౌతు సత్తిబాబు, పల్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



జ్యోత్స్న (963 మార్కులు)

డెంకాడ: అక్కివరం పంచాయతీ గొల్లపేట వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఇంటర్‌లో జొన్నాడ గ్రామానికి చెందిన గులిపల్లి జ్యోత్స్న వెయ్యికి 963 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. జూనియర్ ఇంటర్‌లో బవిరిశెట్టి అవినాష్ 470 మార్కులకు గాను 458 సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. ప్రథమ ఇంటర్‌లో 104 మంది విద్యార్థులకు గాను 40 మంది.. సీనియర్ ఇంటర్‌లో 73 మందికి 43 మంది విద్యార్థులు పాసయ్యారు.

టాపర్లకు అభినందనలు..



టాపర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పద్మలత గురువారం అభినందించారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో మల్యాడ గ్రామానికి చెందిన నందివర్ధన్‌నాయుడు ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 980 మార్కులు సాధించాడు. అలుగోలు గ్రామానికి చెందిన ధనుసా మొదటి సంవత్సరం ఎంపీసీలో 437 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు స్వీట్‌బాక్స్‌లు అందజేసి అభినందనలు తెలిపారు.

రాణించిన ఆర్ఎస్ అకాడమీ విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ రమేష్

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటర్ ఫలితాల్లో ఆర్ఎస్ అకాడమీ విద్యార్థులు రాణించారు. ఎంఈసీ విభాగంలో కేవీవీఎస్ఎస్ నందినిప్రియ (983), రిద్ధికుమార్ జైన్ (974) ప్రతిభ కనబరిచారు. అలాగే వి.లక్ష్మి, సంజన కూడా మంచి మార్కులు సాధించారని క్యాంపస్ డైరెక్టర్ అంట్యాకుల రమేష్, తదితరులు అభినందించారు.

వెంకటరమణ విజయదుందుభి



ఎం. సాహితి



డి. మాధురి



ఓ. సాయిమణి కీర్తన



వి. శిరీష



ఎస్‌కే రఫియా

విజయనగరం ఫూల్ బాగ్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ వెంకటరమణ జూనియర్ కాలేజీ విజయదుందుభి మోగించింది. ప్రథమ ఇంటర్‌లో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎం సాహితి (ఎంపీసీ- 471), డి. మాధురి (ఎంపీసీ - 461), ఓ. సాయి మణికీర్తన (ఎంపీసీ- 461), వి. శిరీష (బైపీసీ - 422), ఎస్‌కే రఫియా (సీఈసీ - 471) రాణించారు.

ఆర్‌కే కళాశాల విద్యార్థుల సత్తా..

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక ఆర్‌కే జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు.ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గిరిడి వెంకటసతీష్ (ఎంపీసీ - 984), వాలే టి సాయిప్రసాద్ (బైపీసీ - 981), బి. పావని (ఎంపీసీ - 970), జి. మెలీసా (ఎంపీసీ - 970), డి. ఉమ(బైపీసీ - 957), ప్రథమ సంవత్సరం విద్యార్థులు పి. సాయితేజ (ఎంపీసీ - 458), కె. గౌతమ్ (ఎంపీసీ - 438), పి. గ్రీష్మ (బైపీసీ - 421), బి. మమత (బైపీసీ - 406) రాణించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, కరస్పాండెంట్ కె. సంతోష్, డైరెక్టర్ అంజనా, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

శ్రీనివాస కళాశాల ప్రభంజనం



కె.శాంతి



ఎస్.దీక్షితాంజలి



కే.ఎస్.నికితాచౌదరి

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాల్లో స్థానిక బాలాజీనగర్‌లో ఉన్న శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ద్వితీయ ఇంటర్‌లో కె.శాంతి (ఎంపీసీ-983), ఎస్.దీక్షితాంజలి (బైపీసీ-978), బి.శివప్రియ (ఎంఈసీ-906), కేఎస్ నికితాచౌదరి (సీఈసీ-949)... ప్రథమ ఇంటర్‌లో ఈ.రోహిత్‌వర్మ (ఎంపీసీ-457), కె..షరోన్ ఫ్లోరా (బైపీసీ-437), టి.అమృతవర్షిణి (ఎంఈసీ-424), టి.కృష్ణవేణి (సీఈసీ-434), ఎ.వర్షిత (హెచ్ఈసీ-456) అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ వర్మ తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేయండి



భోగాపురం: ముంజేరు సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



పూసపాటిరేగ: మాట్లాడుతున్న పతివాడ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మే 3వ తేదీన భోగాపురం రానున్నారని, ఈ సందర్భంగా నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పూసపాటిరేగ మండలం నుంచి సుమారు పది వేల మంది వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, అల్లాడ రమేష్, పుప్పాల లక్ష్మీనారాయణ, ఎన్. సత్యనారాయణరాజు, దాడిశెట్టి త్రినాథరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తరలిరావాలి..

భోగాపురం: అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జరగనున్న సీఎం బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నందిగాం, రామచంద్రపేట, ముక్కాం, ముంజేరు, బైరెడ్డిపాలెం, దల్లిపేట పంచాయతీల్లో ఆయన పర్యటించి పార్టీ నాయకులు, వలంటీర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని సవరవిల్లి వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు మండలంలో ఉన్న ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా సర్పంచ్‌లు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, మత్స్యశాఖ డైరెక్టర్ నరసింహులు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, సర్పంచ్‌లు గరే మురళీమోహనరావు, పూడిక నూకరాజు, దల్లి కాంత, వాసుపల్లి ఎర్రమ్మ, బైరెడ్డి రాజు, సుందర హరీష్, దుక్క అప్పన్న, పి. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దంతులూరి కన్నుమూత



శంకర సీతారామరాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

నెల్లిమర్ల రూరల్: జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, క్షత్రియ సంఘ జిల్లా అధ్యక్షుడు దంతులూరి శంకర సీతారామరాజు (సింగుబాబు) కన్నుమూశారు. కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారుజామున విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన సీతారామరాజు సుదీర్ఘ కాలం రాజకీయాల్లో రాణించి, ప్రజా మనిషిగా పేరు సంపాదించారు. ఈయన మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు కొండవెలగాడ వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తదితరులున్నారు.

సమాజహిత చిత్రాలు రావాలి



ద్రోహి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పక్కన చిత్రబృందం

- ద్రోహి చిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన కోలగట్ల

విజయనగరం: సమాజాన్ని మేల్కొలిపే చిత్రాలు మరిన్ని రావాలని విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పూర్తిగా విజయనగరానికి చెందిన కళాకారులతో యువ దర్శకుడు అఖిల్ బలరాం దర్శకత్వంలో నిర్మించిన 'ద్రోహి' చిత్ర పోస్టర్‌ను కోలగట్ల తన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్ర బృందమంతా విజయగరానికి చెందిన వారు కావడం అభినందనీయమన్నారు. కళలకు నిలయమైన ఈ ప్రాంతంలో ఎంతోమంది వివిధ రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. 30 సంవత్సరాల కిందట విజయనగరంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తీసినట్లు దర్శకుడు అఖిల్ తెలిపారు. మణి క్రియేషన్స్ యూట్యూబ్ చానల్‌లో చిత్రాన్ని త్వరలో విడుదల చేయనున్నామన్నారు. కార్యక్రమంలో కథానాయిక సుష్మ కృష్ణారావు, సంగీత దర్శకుడు శ్రీకాంత్ శర్మ, హరీష్ పాల్గొన్నారు.

ఎర్రజెండానే ఏకైక మార్గం



మాట్లాడుతున్న సీపీఎం నేత సూర్యనారాయణ

శృంగవరపుకోట: ప్రజాధనాన్ని దోచేసి కార్పొరేట్లకు పంచిపెడుతున్న నరేంద్ర మోడీ సర్కారును కూల్చేందుకు ఎర్రజెండానే ఏకై క మార్గమని వామపక్ష నేతలు ఉద్ఘాటించారు. స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో గురువారం వామపక్ష నేతల ప్రచారభేరి ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ.. మోడీ హయాంలో నిరుద్యోగం, నిత్యావసర ధరలు పెరిగిపోయాయని, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే 2 కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి కనీసం 2 లక్షలు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, నోట్ల రద్దు, జీఎస్‌టీ, గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం మోపారని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు అమ్మేస్తున్న ఘనుడు మోడీ అని దుయ్యబట్టారు. మూడేళ్లలోనే అదానీ, అంబానీలను అపర కుబేరులగా మార్చారని విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అన్ని పక్షాలు ఐక్యపోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నేతలు డి.అప్పలరాజు, మద్ది కృష్ణ, షేక్ స్వామి, సీపీఎం నేతలు జి.అప్పలరాజు, చల్లా జగన్, మద్దిల రమణ, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

ముగిసిన ఉపకరణాల ఎంపిక శిబిరం



మాట్లాడుతున్న దివ్యాంగ సంక్షేమ శాఖ ఏ.డి జగదీష్

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు, కోల్‌కతాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ లోకోమోటారు డిజెబిలిటీ (ఎన్ఐఎల్‌డీ) ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన దివ్యాంగుల గుర్తింపు శిబిరం గురువారంతో ముగిసింది. ఈ శిబిరానికి విజయగనరం, విశాఖపట్నం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారిలో 650 మందిని వివిధ ఉపకరణాలు అవసరమని గుర్తించినట్లు ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తెలిపారు. వారికి త్వరలోనే ఉపకరణాలు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ సంక్షేమశాఖ ఏడీ జగదీష్ మాట్లాడుతూ.. ఎందరో దివ్యాంగులకు గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ కొత్తజీవితాలను ప్రసాదించిందని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఐఎల్‌డీ ప్రతినిధి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.